# సుఖరోగం

"ఏం నాంచార్యయా - బియ్యంలో రాళ్ళు కలిపావా, రాళ్ళలో బియ్యం కలిపావా?" రెట్టించి అడిగాడు అతను.

నాంచారయ్య మాట్లాడలేదు - చిన్నగా అతను యింకా లోపలకు వెళ్ళి, బస్తాలోని కందిపప్పు పరీక్ష చేస్తున్నాడు.

"ఇలా కూర్చోండిసార్!" అంటున్నాడు నాంచారయ్య.

అతనేమీ విన్నట్టులేదు.

"బియ్యంలోకి తెల్లరాళ్ళు, కందిపప్పులోకి పచ్చరాళ్లు - యిలా ఇన్ని రంగుల రాళ్ళెక్కడ సంపాదించావయ్యా!" హేళనగా అన్నాడు అతను.

నాంచారయ్య మళ్ళీ చిన్నగా నవ్వాడు కానీ, చాలా గౌరవంగా చేతులు కట్టుకుని మరీ నవ్వాడు.

అతను ఇదేమీ పట్టించుకోకుండా మిగతా సరుకులు పరీక్షగా చూస్తున్నాడు.

అప్పుడే నాంచారయ్య నెమ్మదిగా అన్నాడు "సార్ - అవన్నీ పరీక్ష చేయటం శ్రమతో కూడుకున్న పని సార్"

అతను తల ఎత్తి నాంచారయ్య వేపు చూశాడు.

మళ్ళీ చిన్నగా నవ్వి అన్నాడు నాంచారయ్య - "దాదాపు అన్నిట్లోనూ రాళ్ళూ, మట్టి బెడ్డలూ యిలా ఏవో వుంటూనే వున్నాయి సార్".

"అందుకే కదా నేను హైద్రాబాద్ నించి యిక్కడకు వచ్చింది" అంటూనే మళ్ళీ పరీక్ష ప్రారంభించాడు అతను.

"మీకు ఈ శ్రమ తప్పటమే కాకుండా, లాభం కూడా వచ్చే పద్ధతి చూద్దాం సార్ - ఇక పరీక్ష ఆపేసి యిలా రండి!" వినయంగా అన్నాడు నాంచారయ్య.

అతను ఆగాడు - "నేను అలాటి వాడినికాదు. ఆ పద్ధతుల్ని నా దగ్గర ప్రయోగించకండి" అన్నాడు.

"మీరలా మొహమాట పడితే లాభం లేదుసార్ - ఈ ఐదువందలూ వుంచండి ప్రస్తుతానికి...." నెమ్మదిగా అన్నాడు నాంచారయ్య.

అతను సూటిగా చూసిన చూపుకి, నాంచారయ్య కొంచెం వణికాడు. అయినా పూర్వం వున్న అనుభవాన్ని పురస్కరించుకుని, మళ్ళీ చిరునవ్వు నవ్వాడు.

"మీరు యిక్కడికి రావటం మొదటి సారి కనుక అలా అంటున్నారు. పోయిన సారి వచ్చి నాయన...."

"నేను యిక్కడికి రావటం మొదటి సారి కావచ్చు కానీ, ఈ వుద్యోగంలో ఆరేళ్ళ అనుభవం వుంది నాకు"

"పిల్లలు కలవాడ్ని సార్ - మీకు, నాకూ యిద్దరికీ అనవసరపు హైరానా ఎందుకు - ఈ ఐదు వందలూ వుంచుకుని...."

"సరే - మీరు ఇంతగా అంటున్నారు కనుక మిమ్మల్ని వదిలేస్తాను. కానీ....."

"కానీ...." నాంచారయ్య కళ్ళల్లో సన్న బియ్యంలో చిన్నరాయంత వెలుగు కనపడింది.

"కానీ.... నా రేటు ఐదు వేలు....."

"ఐదు వేలే.... చాల ఎక్కువ సార్! ఇంతకు ముందాయన...."

"అయితే ఒక పని చేయండి.... మీరేమీ యివ్వనవసరం లేదు. శాంపిల్స్ నేను

హైద్రాబాద్ తీసుకువెళ్ళి ఎనలైజ్ చేయిస్తాను. కల్తీ అని బయటపడితే - మీకు జరిమానా, జైలు శిక్ష - సరేనా!"

"లేదు సార్ - ఐదు వందలు మామూలు రేటే. మీరు మంచివారులా వున్నారు కాబట్టి యింకో ఐదు వందలు - మొత్తం వెయ్యి యిస్తాను తీసుకోండి. నా మానాన నన్నిలాగే బ్రతకనీయండి!" అన్నాడు నాంచారయ్య.

"లాభంలేదు నాంచారయ్యగారూ - నేనేనాడూ యిలాటి కేసుల్లో ఆరేడు వేలకు తగ్గలేదు. అయినా మిమ్మల్ని చూసి ఐదు వేలతో ఈ సారికి సరిపెడదామనుకుంటున్నాను. తర్వాత మీ యిష్టం!"

నాంచారయ్య అతనికి ఎంతగానో నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు. అతను ఏ మాత్రం తగ్గేట్టు కనపడలేదు.

నాంచారయ్య మెదడులో ఏదో ఆలోచన మెదిలింది.

"సరే సార్ - మీ యిష్టం. నేను వెయ్యి రూపాయల పైన పైసా కూడా యివ్వలేను, తర్వాత మీ యిష్టం. శాంపిల్స్ తీసుకునేట్టయితే తీసుకోండి నాకేం అభ్యంతరంలేదు" కొంచెం బింకం గానే అన్నాడు నాంచారయ్య.

అతను వింతగా చూశాడు నాంచారయ్యని. ఒక క్షణం ఆలోచించి తల పంకించాడు.

నాంచారయ్య ఏమీ మాట్లాడకుండా అతన్నే చూస్తున్నాడు.

అతను లేచి, కొట్లో సరుకు పెట్టిన వేపు నడిచాడు.

కొంచెం కందిపప్పు చేతిలోకి తీసుకుని, పరీక్షగా చూసి, చిన్న సంచిలో పోసాడు.

నాంచారయ్య ఏమీ మాట్లాడకుండా అతన్నే చూస్తున్నాడు.

అతను, నాంచారయ్య వేపు చూడకుడానే, కొంచెం బియ్యం, పెసరపప్పు, మినపప్పు, శెనగపిండి, గోధుమపిండి, పసుపు - యిలా అక్కడవున్న చాల సరుకులు చిన్నచిన్న కాగితాల మీద ఏదో వ్రాసి, తను సంతకం చేసి, నాంచారయ్యను కూడా సంతకం చేయమన్నాడు. నాంచారయ్య ఏమీ అభ్యంతర పెట్టకుండా వెంటనే సంతకం చేయటం, అతనికి వింతగా అనిపించింది. సంచుల్ని ఆ కాగితాలతో సహా కలిపి సీల్ చేశాడు.

మాట్లాడకుండా బయటకు నడిచాడు.

మునిసిపల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్లకు, అప్పుడప్పుడూ యిలా దుకాణాల్లోకి రావటం, సరుకులు పరీక్ష చేయటం అలవాటే. కల్తీ సరుకులు పరీక్షచేయటం అలవాటే! కల్తీ సరుకులు చాల కొట్లలో దొరకటం, వాళ్ళు కాస్తో కూస్తో యధాశక్తి యిచ్చుకోవటం, వీళ్ళుచూసి చూడనట్లు పోవటంకూడా మామూలే కానీ, మధ్య మధ్యలో యిలా హఠాత్తుగా హైద్రాబాద్ నుంచి స్పెషల్ స్క్వాడ్ రావటం కల్తీవర్తకులకి పెద్ద బెడద అయి పోయింది. కొంతమంది ఇన్‌స్పెక్టర్లు యిలాటి కల్తీ వర్తకుల్ని పట్టుకుని, శిక్ష పడేలా చేసినా, కొంతమంది మాత్రం లంచాలు తినేసి వాళ్ళను వదిలేయటం కూడా జరుగుతున్న విషయమే--

ఈ సారి అతను అంత డబ్బు అడిగే సరికి నాంచారయ్యకు యివ్వ బుద్ధికాలేదు. అందులోనూ అతనికి యిలాటి వ్యవహారాల్లోనుంచి తప్పించుకునే యింకొక మార్గం తెలుసు కనుక, మరీ బెట్టు చేశాడు--

శాంపిల్స్ తీసుకుని, అతను వెళ్ళిన మరునాడే, నాంచారయ్య కూడా హైద్రాబాద్‌కి ప్రయాణం అయాడు.

నాంచారయ్య యింతకు ముందొకసారి కూడా యిలాటి కేసులోనే యిరుక్కున్నాడు- అప్పుడు ఆ యిన్‌స్పెక్టర్ కూడా చాల ఎక్కువ రేటు చెప్పటంతో, అతనికి ఏమీ యివ్వలేదు. హైద్రాబాద్‌లో ఈ శాంపిల్స్ ఎనలైజ్ చేసే లేబరేటరీలో, ఎవర్ని కలవాలో కనుక్కుని, అతనికే ఓ అయిదు వందలు సమర్పించాడు.... ఫలితంగా శాంపిల్స్‌లో కల్తీ ఏ మాత్రం లేదనే రిపోర్ట్ వచ్చింది. నాంచారయ్య బయటపడ్డాడు.

ఈసారి కూడా అదే పని చేద్దామని, హైద్రాబాద్ చేరాడు నాంచారయ్య-- ఇలాటి వ్యవహారాలు మామూలుగా కాంటీన్లో కాఫీ టెబుల్ మీదుగా జరుగుతాయి కనుక . ముందు అక్కడికే దారి తీశాడు. నాంచారయ్య అతని అదృష్టం బాగుండి ఆ ఎనలిస్ట్ అక్కడే కూర్చుని, తాపీగా సిగరెట్టూ, కాఫీ రెండూ త్రాగుతున్నాడు.

నాంచారయ్య వెళ్ళి నమస్కారం చేసి ప్రక్కనే కూర్చున్నాడు.

చాల ఆప్యాయంగా, ఎంతో దగ్గర సంబంధం వున్న వ్యక్తితో చెప్పినట్టుగా తన పని చెప్పాడు. చెబుతూనే అయిదు వంద రూపాయిలున్న కవరు కూడా అతని చేతిలో వుంచాడు.

అతను, " మిగతా విషయాలన్నీ నేను చూసుకుంటా నాంచారయ్యగారూ--మీరు నిశ్చింతగా వెళ్ళిరండి!" అని అభయం కూడా యిచ్చాడు.

ఇది జరిగిన ఇరవై రోజులకు నాంచారయ్య కొట్లో కూర్చుని వుండగా, పోలీసులు వచ్చి అతన్ని అరెస్ట్ చేశారు. కారణం అతని కొట్లోని సరుకులు, అన్నీ కల్తీవేనని నిరూపించబడటమే!

"ఆడికి ఆ డబ్బు చాలకపోతే యింకా ఎక్కువ అడిగి వుండచ్చుకదా - నా కొంప ముంచాడు" అని మాత్రం చాలసార్లు అనుకున్నాడు నాంచారయ్య.

మొత్తానికి నాంచారయ్యకు మూడు నెలలు జైలుశిక్షా, ఫైనూ విధించారు.

నాంచారయ్య కొట్టు ప్రక్కన వున్న పెంచెలయ్య 'వీడికి మా బాగా శాస్తి అయింది' అనుకున్నాడు, తన కొట్లోని శెనగపిండిలో, బఠానీ పిండి కలుపుతూ.

కానీ పెంచెలయ్య అనుకున్నట్టు, నాంచారయ్య ఫైన్ కట్టాడు కానీ జైలుకీ మాత్రం వెళ్ళలేదు.

ప్రభుత్వం ఆసుపత్రిలో ప్రత్యేక వార్డులో రోగిగా ఎడ్మిట్ అయాడు. ఆ ఆసుపత్రిలోని స్పెషలిస్ట్ డాక్టర్, నాంచారయ్యకి కడుపులో ఏదో వుందనీ, అతను హాస్పిటల్లో ప్రత్యేక

వార్డులో మంచం మీద మూడు నెలలు సుఖంగా పడుకుని, మందులూ, విశ్రాంతి తీసుకోవాలనీ, అలా తీసుకోకపోతే అతని ఆరోగ్యం క్షీణించి పోతుందని, ఒక గట్టి సర్టిఫికేట్ యివ్వటం వలన, నాంచారయ్యని ప్రత్యేకవార్డులోనూ, ఇద్దరు పోలీసుల్ని రాత్రిపగలూ కూడా వార్డు బయట, వుంచక తప్పలేదు.

ఆ మూడు నెలలూ నాంచారయ్య సుఖంగా, రోగంతో బాధపడుతూ, తనకి మందులు యిచ్చేడాక్టర్లకి వేరే మందు కోసం ధన సహాయం చేస్తూ, విశ్రాంతి తీసుకున్నాడు.

నాంచారయ్యకు హాస్పిటల్ వాతావరణం బాగుందేమో, మంచి ఒళ్ళు కూడా నచ్చింది.

ఈలోగా నాంచారయ్యని విశ్రాంతి తీసుకోమని వ్రాతపూర్వకంగా సలహా యిచ్చి, అతని మంచి చెడ్డలు చూస్తున్న డాక్టర్‌గారు కొత్తగా ఒక రిఫ్రిజిరేటర్ కూడా కొనుక్కున్నాడు. ఆయన ఎండలు మండిపోతున్న ఆంధ్రదేశంలో రిఫ్రిజిరేటర్ ఆవశ్యకతను గురించి బాగా తెలుసుకున్న వాడయినా, కొనలేక యిన్నాళ్లు ఆగాడు--- ఇన్నాళ్ళకి నాంచారయ్యగారి "సుఖ" రోగం పుణ్యమా అని, ఆయన ఫ్రిజ్‌లోని చల్లటి బీరు మూడు పూటలా త్రాగకలుతున్నాడు.

నాంచారయ్య మూడు నెలల శిక్షా, హాస్పిటల్‌లోనే పూర్తయింది అదేమి ఆశ్చర్యమో, డాక్టర్‌గారు ఏ మందు వాడేడో కానీ, శిక్ష పూర్తయిన రెండో రోజునే, నాంచారయ్య కడుపులో కున్న "అదేదో" వెంటనే మాయమయింది.

డాక్టర్‌గారు మళ్ళీ యింకో సర్టిఫికేట్ యిచ్చారు. నాంచారయ్యగారు 'మామూలు' మనిషి అయాడనీ. డిశ్చార్జి, చేయవచ్చనీ--

నాంచారయ్య ఆవిధంగా తన 'చికిత్స' పూర్తిచేసుకుని, తిరిగి వచ్చి, మళ్ళీ కొట్లో కూర్చుని, తెల్లరాళ్ళలో బియ్యం, పచ్చరాళ్ళలో కందిపప్పు, మట్టిబెడ్డల్లో మినపప్పు - యిలా యధాశక్తి కల్తీ చేస్తూ, హాస్పిటల్లో డాక్టర్లకి, పోలీసులకి పెట్టిన ఖర్చుకు రెండింతలు, సంపాదించటం మొదలు పెట్టాడు.

కానీ ఒక్క విషయం మాత్రం మరచిపోలేదు.

ఇలాటి కేసుల్లో హైద్రాబాద్ వెళ్లినప్పుడల్లా ఎనలిస్ట్‌కి డబ్బులు యిచ్చేముందు, అతను యింకా ఆ ఉద్యోగంలో వున్నాడా లేదా అని నిర్ధారణ చేసుకుని మరీ ఐదువందలు అందచేస్తున్నాడు కారణం ముందు డబ్బు యిచ్చిన ఎనలిస్ట్‌ను ఎవరిదగ్గరో యిలానే డబ్బు తీసుకుంటుండగా పట్టుకుని, ఉద్యోగంలో నించి పీకి పారేశారు. అతనికి లంచాలు తినటంలో తప్ప వేరే దేంట్లోనూ అనుభవం లేదు కనుక ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. అందుకే రోజూ వచ్చి "అలా" కాంటీన్‌లో కూర్చుంటాడు. అతనింకా సర్వీస్ లోనే వున్నాడనుకుని, ఎవరయినా నైవేద్యం యిస్తే కళ్ళకద్దుకుని మరీ తీసుకుంటాడు, ఆ నిరుద్యోగి. నాంచారయ్య విషయంలోకూడా యిలాగే జరిగిందదే కనుక, ఈవిషయంలో మాత్రం నాంచారయ్య చాల జాగ్రత్తగా వుంటున్నాడు. ✿